

రెవెన్యూ సేవలు కీలకం

కలెక్టర్ టిఎస్.చేతన్



విశ్రాంత ఉద్యోగాలను సన్మానిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజలకు అందుతున్న వివిధ సేవల్లో రెవెన్యూ శాఖ పాత్ర ఎంతో కీలకం అని, ఇలాంటి శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు పారదర్శకతతో విధులు నిర్వహించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు కలెక్టరేట్‌లో జరిగిన రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి, రెవెన్యూ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ ఉద్యోగి తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందుకుని ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అందించాలన్నారు. రెవెన్యూ శాఖలో ప్రధానంగా భూ సమస్యలు అధికమని వాటి పరిష్కారానికి అందరూ చిత్తశుద్ధితో పనిచేసే ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఈ శాఖలో విపత్తు నిర్వహణ ఒక భాగమైందన్నారు. పారదర్శకంగా సేవా భావంతో పనిచేసి రెవెన్యూ శాఖ ప్రతిష్ట పెంచాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ సేవలు అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు ఎంతో కీలకమన్నారు. అనంతరం రెవెన్యూ శాఖలో సేవలు అందించిన విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్లు అశోక్ గుప్తా, నారాయణస్వామిలను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, రామ సుబ్బయ్య, ఏవో వెంకటనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

నిలువనీడ లేదాయే..!

- పెనుకొండలో నడిరోడ్డుపై ప్రయాణికుల నిరీక్షణ..!
- డివిజన్, నియోజకవర్గ కేంద్రంలో బస్ షెల్టర్లు కరువు
- పూలు, పండ్ల దుకాణాల నీడే దిక్కు
- రోడ్డు పక్కన ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-పెనుకొండ

నియోజకవర్గ కేంద్రం, చారిత్రక పట్టణంలో ప్రయాణికులకు నిలువనీడలేదు. బస్సులు రాక కోసం నిరీక్షించే వారికి నీడ కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నచిన్న మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం బస్సు షెల్టర్లు ఉండగా, పెనుకొండ పట్టణంలో లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులకు గురి చేస్తోంది. రాకపోకలు సాగించే వారు బస్సు షెల్టర్లు కరువై పండ్లు, పూల దుకాణాలు, టీ కొట్లు వద్ద నిరీక్షించాల్సిన దుస్థి నెలకొంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఎండ, వానకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



అంబేద్కర్ సర్కిల్లో బస్సు కోసం రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు

డివిజన్ కేంద్రంలో బస్ షెల్టర్లు కరువు

పెనుకొండ నియోజకవర్గ కేంద్రమే కాదు.. డివిజన్ కేంద్రం కూడా. ఇక్కడ బస్ షెల్టర్లు లేకపోవడం ఆశ్చర్యం కలిగించే అంశమే. బస్సు వచ్చేంత వరకు నడిరోడ్డుపై పడిగాపులు కాయాల్సిందే. పెనుకొండలో బస్టాండు మినహా మిగితా బస్సులు ఆపే ఏ చోట కూడా బస్‌షెల్టర్లు లేవు. ముఖ్యంగా అంబేద్కర్ సర్కిల్‌లో వివిధ గ్రామాలు, పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో అక్కడ బస్సుల కోసం వేచి ఉంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఉంటుంది. అలాంటి ప్రాంతంలో ప్రయాణికులకు నిలువ నీడ లేదు. ఇక్కడి నుంచి అనంతపురం, ధర్మవరం, పుట్టపర్తి, బుక్కపట్నం, మడకశిర, రొద్దం, పావగడ, హిందూపురం, బెంగళూరు తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంబేద్కర్ కూడలిలో ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు, ఆటోలు, జీపులు ప్రయాణికులను ఎక్కించుకుంటారు. ఇంత రద్దీగా ఉండే ప్రాంతంలో కనీసం ఒక్క బస్‌షెల్టర్ కూడా లేదు. నిత్యం వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు రాకపోకలు సాగించే ప్రాంతంలో నిలువనీడ లేకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



బస్సుల కోసం ఎదురు చూస్తూ ఎండవేడిమిక రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు

పండ్లు, పూల దుకాణాల సంచినీడే దిక్కు..

అంబేద్కర్ సర్కిల్లో బస్సులు, ఆటోల కోసం రోడ్డుపైన వేచి ఉండే ప్రయాణికులు ఎండ, వానకు తట్టుకోలేక అక్కడ ఉన్న పండ్లు, పూల దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకుని సంచి నీడ కింద తలదాచుకుంటున్నారు. దుకాణాల ముందు ఎక్కువ సేపు నిలబడితే తమ వ్యాపారాలు జరగడం లేదంటూ వ్యాపారులు విసుక్కుంటున్నారు.

రోడ్డు పక్కన ఎదురుచూపు

పెనుకొండ, సమీప ప్రాంతాల నుంచి వైద్య చికిత్సల నిమిత్తం వికలాంగులు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు, గర్భిణులు పుట్టపర్తి, అనంతపురం, బత్తలపల్లి ఆసుపత్రులకు వెళ్తుంటారు. ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా వీరందరూ అంబేద్కర్ సర్కిల్లో వేచి ఉండాల్సిందే. అలాంటి ప్రాంతంలో కనీసం కూర్చొనేందుకు బల్లలు లేకపోవడంతో వీరంతా అసౌకర్యానికి గురవుతున్నారు.

బల్లలు ఏర్పాటు చేసిన సవిత

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఈ ప్రాంతంలో అక్కడక్కడ సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవి మాత్రమే ప్రయాణికులకు ఉపయోగపడుతున్నాయి. ఇవి కూడా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఉండడం లేదు. అంబేద్కర్ సర్కిల్‌లో నిల్చొవడానికి నీడలేకపోవడంతో ఆర్‌బ్యూఎస్, తహశీల్దార్ కార్యాలయాల ఆవరణలో బస్సులు వచ్చేవరకు వేచి ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి పెనుకొండ అంబేద్కర్ సర్కిల్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి

చారిత్రక నేపథ్యం కలిగిన పెనుకొండలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధుల పరిస్థితి మరి దారుణంగా ఉంటోంది. దూరంగా ఉన్న చెట్ల కింద వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి బస్సుషెల్టర్లను ఏర్పాటు చేయాలి.

కదిరప్ప, ప్రయాణికుడు.

నేడు ఎంజీఎంలో యోగాంధ్ర

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ శనివారం ఉదయం 6 గంటలకు జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం ఎంజిఎం మైదానంలో ప్రారంభం అవుతుందన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పట్టణ ప్రజలందరూ ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, ఎంజిఎం పీడీ లోకనాథ్, సచివాలయం సిబ్బంది, వివేకానంద యోగా కేంద్రం నిర్వాహకులు బద్రీనారాయణ, రమేష్ కలిపి, లక్ష్మీ నారాయణ, మహేంద్ర, ఉపాధ్యాయులు హరి ప్రసాద్, మక్బూల్, ఆంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ రమేష్ కుమార్

సోలార్‌కు 'సాగు భూములివ్వం..!

అధికారులకు తెగేసి చెప్పిన బొమ్మపర్తి రైతులు



భూములు ఇవ్వమని రెవెన్యూ అధికారులు చెబుతున్న బొమ్మేపర్తి పంచాయతీ రైతులు

ప్రజాశక్తి-రాప్తాడు

'తాతల కాలం నుంచి ఈ భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం.. అలాంటి భూములను ఎంఎస్ఎంఇ పార్కుల కోసం బలవంతంగా లాక్కోవాలని చూస్తే సహించం.. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదు.' అంటూ రాప్తాడు మండలం బొమ్మేపర్తి, గొందిరెడ్డిపల్లి గ్రామ రైతులు అధికారులకు తెగేసి చెప్పారు. ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు పేరుతో రాప్తాడు మండలం బొమ్మేపర్తి, గొందిరెడ్డి పల్లి గ్రామాల్లో భూములను తీసుకునేందుకు అధికారులు సర్వే చేశారు. దీనిని ముందు నుంచి ఆ గ్రామ రైతులు వ్యతిరేకిస్తున్నారు. భూమలిచ్చేందుకు తమకు ఇష్టం లేదంటూ సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే పలుమార్లు తహశీల్దార్, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా అధికారులు పదేపదే వస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం గ్రామానికి వచ్చిన ఆర్ఐ, విఆర్వోలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి పోతలయ్య మాట్లాడుతూ బొమ్మేపర్తి రెవెన్యూ పొలంలో 27 మంది రైతులకు 120 ఎకరాలను 60 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మంజూరు చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం భూములు ఇచ్చిన స్థలంలో అందులో పెద్దపెద్ద గుట్టలు, రాళ్లు ఉండగా రైతులు సాగు కోసం వాటిని ఎంతో శ్రమ, ఆర్థిక పరిస్థితులకు ఓర్చి సాగులోకి తెచ్చుకున్నారని తెలిపారు. ఒక్కో రైతు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారన్నారు. అందులో బోర్లు వేసుకుని పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఆ భూములను పరిశ్రమ పేరుతో లాగేసుకుంటే రైతులు రోడ్డున పడుతారన్నారు. రైతులు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేకున్నా బొమ్మపర్తి పొలంలోని 307 సర్వేనెంబర్‌లో ఉన్న 114 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించడానికి తహశీల్దార్ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా భూములు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని భూముల జోళికి రావొద్దని తెలియజేశారు. బలవంతంగా భూములు తీసుకోవాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ముత్యాలప్ప, వన్నూరప్ప, నిర్మల, మౌనిక, పార్వతమ్మ, ఎల్లమ్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా కూటమి పాలన

నిబంధనల పేరుతో తల్లికివందనంలో కోత - వైసిపి అధికార ప్రతినిధి శ్యామల



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల ముందు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైసిపి అధికార ప్రతినిధి శ్యామల విమర్శించారు. ప్రశ్నించారు. ఇటీవల వైసిపిలో పలు పదవులను పొందిన హిందూపురం ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డి ఆధ్వర్యంలో పట్టాభిషేక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్యామలతో పాటు జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్లమెంట్ పరిశీలకులు రమేష్ రెడ్డి, వజ్ర భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. నిబంధనల పేరుతో తల్లికివందనంలో కోతలు విధించారన్నారు. మహిళలకు రక్షణ ఇస్తాం అంటూ నిత్యం మాట్లాడే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ముఖ్యమంత్రి ప్రాతినిత్యం వహిస్తున్న కుప్పంలో ఓ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన కన్పించలేదాని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈవీఎంలను అడ్డుపెట్టుకుని కూటమి గెలిచిందన్నారు. హిందూపురంలో ఓ పోలింగ్ బూత్‌లో వైసీపీకి ఒక్క ఓటు వచ్చిందంటే ఇక్కడ నందమూరి బాలకష్ణ గెలుపు ఏ విధంగా వచ్చిందో అర్థం చేసుకోవచ్చన్నారు. హాట్రిక్ విజయాలు సాధించిన బాలకృష్ణ హిందూపురం అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలన్నారు. వైసిపిలో పదవులు పొందిన వారందరూ ప్రజల్లో ఉంటూ కూటమి వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచితంగా భూముల సబ్‌డివిజన్

- 30లోపు దరఖాస్తు చేసుకోండి
- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉమ్మడి పట్టాదారుల భూములకు ఉచితంగా సబ్ డివిజన్ సేవలు పొందేందుకు రైతులు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. సబ్ డివిజన్ చేయించుకోవాలనుకునే రైతులు సంబంధిత గ్రామ సచివాలయాల్లో అర్జీలు ఇవ్వాలన్నారు. గతంలో ఈ సేవలు పొందేందుకు రూ.500 చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం దీనిని తొలగించిందన్నారు. నామమాత్రపు ఫీజు రూ.50 చెల్లిస్తే చాలన్నారు. ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకున్న రైతులకు మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంటలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప తెలిపారు. శుక్రవారం పంచాయతీ పరిధిలో అదనపు కూలీలతో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఆయా పనులను సర్పంచి రత్నమ్మ పర్యవేక్షించారు.

విద్యాసామగ్రి పంపిణీ



పుస్తకాల పంపిణీలో మాట్లాడుతున్న ఛైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రహమత్ పురం జాకీర్ హుస్సేన్ మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో సర్వేపల్లి రాధాకష్ణ విద్యార్థి మిత్రలో భాగంగా విద్యార్థులకు విద్యాసామగ్రి, యూనిఫాంను శుక్రవారం పంపిణీ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై వీటిని అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, వార్డ్ ఇన్‌ఛార్జి ఇలియాజ్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, షఫీవుల్లా, సిద్ధి, అల్లాబకాష్, దేవరాజ్, సమీవుల్లా, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడేళ్లలో చెరువులు, రిజర్వాయర్లు నింపుతాం : ఎమ్మెల్యే



జెసిబి కి పూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే సింధూర రెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వచ్చే మూడేళ్లలో నియోజకవర్గంలోని 193 చెరువులతో పాటు రిజర్వాయర్లను కృష్ణా జలాలతో నింపడమే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి చెరువు కాలువ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బుక్కపట్నం చెరువు కట్ట పటిష్టతకు రూ. 13.43 లక్షలు, ఎనుములపల్లి చెరువు కాలువ పనులకు రూ. 2.09 లక్షలు మంజూరు చేసిందన్నారు. చెరువులు, కాలువల మరమ్మతులు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. అనంతరం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. వారి వెంట టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు బెస్త చలపతి, పిసి.గంగన్న, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సురేష్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, ఉమాపతి, గంగాద్రి, మాధవి ఉన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

పుట్టపర్తి క్రైమ్ : రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు పని చేస్తున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. యోగాంధ్ర దినోత్సవం సందర్భంగా శనివారం నియోజకవర్గంలో నిర్వహించే యోగా డేలో టిడిపి శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాస్థాయిలో హిందూపురంలో జరిగే యోగా డేలో తాను పాల్గొంటున్నట్లు తెలిపారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆరోగ్యం సరిగా లేకపోతే ఆసుపత్రి పాలు కావాల్సి వస్తుందన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

కొత్తచెరువు : కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు సిఎం చంద్రబాబు ఇంటి పెద్ద కొడుకుగా అండగా ఉన్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 1,75,014 చెక్కును పుట్టపర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో కొత్తచెరువు మండలంలోని మైలసముద్రం గ్రామానికి చెందిన ఎన్.కళావతికి ఎమ్మెల్యే అందజేశారు.

కూలీలు కాదు విద్యార్థులు..!

విద్యానిధి కళాశాలలో విద్యార్థులతో పనులు



ఇనుప వస్తువులు తరలిస్తున్న విద్యార్థులు



ప్రజాశక్తి-పరిగి

మండల పరిధిలోని కాలువపల్లి సమీపంలో ఉన్న విద్యానిధి జూనియర్ కళాశాలలో విద్యార్థుల చేత పనులు చేయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కళాశాలకు సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకుంటున్నారు. కళాశాల పున:ప్రారంభం నేపథ్యంలో యాజమాన్యం కళాశాలలో మరమ్మతులు, పరిశుభ్రత పనులకు ఉపక్రమించింది. ఈ క్రమంలో కళాశాల ప్రాంగణంలో ఉన్న పలు వస్తువులను విద్యార్థుల చేత అక్కడి నుంచి ఇక్కడికి మోయించడం చూసిన ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యం వైఖరిపై మండిపడుతున్నారు. విద్యా బుద్ధులు నేర్చుకునేం దుకు వచ్చిన విద్యార్థుల చేత ఇలా బరువైన వస్తువులు మోయించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. వస్తువులను తరలించే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చదువుకునేందుకు వచ్చిన విద్యార్థుల చేత అధ్యాపకులు, యాజమాన్యం ఇలాంటి పనులు చేయించడం ఏమాత్రం సమంజసం కాదని పేర్కొంటున్నారు. ఈ విషయంపై కళాశాల యాజమా న్యాన్ని వివరణ కోరగా కళాశాలలో ఓ ప్రాంతంలో ఐరన్ పరికరాలు ఉంచగా పాముల బెడద ఎక్కువైందని, దీంతో వాటిని మరోచోటికి పెట్టించాల్సి వచ్చిందని పేర్కొనడం గమనార్హం.



షోరూంను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్

మోతుకపల్లిలో ట్రాక్టర్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పరిధిలోని మోతుకపల్లిలో నూతన ట్రాక్టర్ షోరూమ్‌ను మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్ కుమార్ ప్రారంభించారు. లేపాక్షి జనసేన నాయకులు లోకేష్ ఈ షోరూంను ఏర్పాటు చేశారు. తమ షోరూంలో రైతులకు అవసరమైన ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు లోకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, టీడీపీ నాయకులు చంద్ర మోహన్, జనసేన నాయకులు ఆకుల ఉమేష్, నిమ్మకాయల రాము, శేఖర్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

గుడిబండ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రభుత్వం వ్యవసాయానికి అనుసంధానం చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి రాధమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఎంపిడిఒ కేశవరెడ్డి, ఈవోఆర్డీ నాగరాజునాయక్, వైస్ ఎంపిపి రత్నమ్మ హాజరయ్యారు. ముందుగా అధికారులు శాఖల వారీగా ఆయా శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, పనులను వివరించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు, ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు సక్రమంగా చేరవేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు అవసరమైన పనులు కల్పించి సకాలంలో బిల్లులు అందేలా చూడాలని ఎపిఒ జగదీష్‌ను ఆదేశించారు. వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న యంత్రాలు, సామగ్రి, డ్రిప్, రాయితీ విత్తన వేరుశనగ, తదితర వాటిపై వ్యవసాయ అధికారి వీరనరేష్ వివరించారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, అంగన్వాడీ, పంచాయతీల్లో పరిశుభ్రత, తదితర వాటిపై ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక బీసీ కాలనీలో కొంత కాలంగా తాగునీటి సమస్య నెలకొన్నట్లు తెలియడంతో స్పందించిన ఎమ్మెల్యే నూతనంగా సత్యసాయి వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయించారు. ఆ ట్యాంకును శుక్రవారం ఎమ్మెల్యే సింధూర మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని లేదా నూతనంగా బోరు తవ్వించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం కాలనీ ప్రజలు పలు సమస్యలను ఏకరువు పెట్టగా తక్షణమే వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంపిడిఒ నటరాజుకు సూచించారు. బీసీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థను చూసి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం కొత్తచెరువుకు



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింధూర

చెందిన పెద్దన్న, ఆంజనేయులుకు వారు టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యు ఎస్ జేఈ ఓబులేసు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి రాధా, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, బైరాపురం సర్పంచి రవి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు లక్ష్మీనారాయణ, మాణిక్యం బాబా, రమేష్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఆర్.నాగేంద్ర, సైకిల్ షాప్ బాబా, ఇదయతుల్లా, బైరాపురం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి : కందికుంట

ప్రజాశక్తి-గాండ్లపెంట

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశించారు. 'మన ఇంటికి మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'మన ఇంటికి-మన ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ బి.బాబు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

రావు, ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, ప్రసాద్, కిరణ్ కుమార్‌రెడ్డి, ఎంపిపి జి.సోమశేఖర్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, సర్పంచి ఎస్.శివప్ప నాయుడు, చిన్నోడు, వెంకటరమణారెడ్డి, ప్రసాద్ ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు సాధ్యం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైందని ఎపి అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భూక్యా కాలేనాయక్ స్పష్టం చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉచిత గ్యాస్, తల్లికి వందనం పథకాలు అమలు చేసి అన్ని వర్గాల మన్ననలు పొందిందన్నారు. పోలవరం, రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసేలా ముందుకెళ్తుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను కూడా త్వరలో అమలు చేయనుందని తెలిపారు. అర్బన్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నుంచి పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 115 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన కోసం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారను. జిల్లాకు త్వరలో ఆపిల్ సెల్ పరిశ్రమ, ఒడిసి, అమడగూరు, నల్లమాడ మండలాల్లో గార్మెంట్స్ పరిశ్రమలు



మాట్లాడుతున్న భూక్యా కాలేనాయక్

అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

మాజీ మంత్రి పల్లెపై ఆరోపణలు అవాస్తవం

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిపై ఇటీవల కొందరు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన తీవ్రంగా ఖండించారు. 30 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సేవే కర్తవ్యంగా భావించి నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న పల్లె కుటుంబానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సమవేశంలో వెంకటాపురం ఎంపిటిసి శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గోరంట్ల

జులై 9వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధి కారి సాంబశివ కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. సమ్మెకు సహకరిస్తూ స్వచ్ఛంధంగా పరిశ్రమలు బంద్ చేయాలని కోరుతూ శుక్రవారం గార్మెంట్స్, శాండిల్స్ పరిశ్రమల హెచ్‌ఆర్‌లకు భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ వెంకటేష్ అధ్యక్షతన ముందస్తు సమ్మె నోటీసులు అందజేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణాల త్యాగ ఫలితంగా హక్కులు, కార్మిక చట్టాలు



సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు

సాధించుకున్నామ న్నారు. వాటిని ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసి కార్మికులపై పని భారం పెంచేలా వ్యవహరిస్తున్నాయని మండి పడ్డారు. కార్మిక వ్యతిరేక విధానాలపై చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని కోరారు.

పంచాయతీ బోర్డు తొలగించిన వారిపై చర్యలకు డిమాండ్

రొద్దం : రొద్దంలో వెలసిన రుక్మిణీపాండురంగ స్వామి ఆలయం వద్ద పంచాయతీకి సంబంధించిన బోర్డు, బండలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు వేణుగోపాల్, పవన్, తిప్పేస్వామి, రవిశంకర్, మహదేవ్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ నరసింహారెడ్డి అనే వ్యక్తి 4 రోజుల క్రితం ఆలయం వద్ద ఉన్న బండలను తొలగించి తీసుకెళ్లడంతో పాటు ఆలయానికి చెందిన రాతి బండలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ విషయంపై రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

విత్తన వేరుశనగ కేటాయింపులో కోత

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలో 13 పంచాయతీల్లో 9,300 మంది రైతులు ఉండగా కేవలం 1,710 క్వింటాళ్ల విత్తన వేరుశనగ వచ్చిందని రైతులు విమర్శిస్తున్నారు. గతంలో మండలానికి 2,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ వచ్చేదని, ఈ ఏడాది కేవలం 1,710 కింటాళ్లు మాత్రమే రావడంతో రైతులకు పూర్తిస్థాయిలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు సరిపడా విత్తన వేరుశనగను సకాలంలో అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సమస్యలతో వైద్య చికిత్సలకు ఇబ్బంది పడుతున్న అభాగ్యులకు ఎన్‌డిఎ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న ఇద్దరికి మంత్రి సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేయించారు. వారిలో స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన చింతా వాసుదేవ వైద్య ఖర్చులకు రూ. 6 లక్షలు, గుంటూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముదిగుబ్బకు చెందిన చాకలి ఆంజనేయులుకు రూ. 2 లక్షలు మంజూరు చేయించారు.

సచివాలయం పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని గౌడనహళ్లి పంచాయతీలోని గ్రామ సచివాలయాన్ని శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతు న్నాయా అని సచివాలయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం, పాలకులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ కొంకల్లు కృష్ణమూర్తి, నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎంఇఒపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కదిరి టౌన్

మండలంలో నిబంధనలు అతిక్రమించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా పలు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్, షూస్, స్టేషనరీ విక్రయిస్తున్నార న్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారే కానీ కనీస వసతులు కల్పించడం లేదన్నారు. ఏ ఒక్క పాఠశాలలోనూ నోటీసు బోర్డులో ఫీజులు, తదితర వివరాలు ప్రదర్శించడం లేదన్నారు. ఇవన్నీ తెలిసినా ఎంఇఒ ఏమాత్రం స్పందించడం లేదని ఆయపై తక్షణం చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు విజయ్, పిఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు భక్తర్, పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములుయాదవ్ పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్తర్ ఆధ్వర్యంలో పెనుకొండ టౌన్, వార్డు ఇన్‌ఛార్జిలు, కమిటీ సభ్యుల నియామకంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు శ్రీనివాసులు, మంజునాథ్, బాబుల్‌రెడ్డి, సాయి ప్రసాద్, సుబ్రహ్మణ్యం, పులుగూర శ్రీనివాసులు, అస్లాం, షఫీక్, రియాజ్, కురుబ నంజుండ, బోయ నంజుండ, రఘు, సోము, నారాయణ నాయక్, చంద్రకాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్ష కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కంటి పరీక్ష కేంద్రాలను చట్టపరంగా నిర్వహించాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఫైరోజ్‌బేగం హెచ్చరించారు. ఆమె శుక్రవారం పట్టణంలోని అక్షయ, నేత్రాలయ కంటి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద రిజిస్టర్ చేసుకోవాలని ఆదేశించారు. సర్జన్ సదుపాయం లేనందున బోర్డులో ఆపరేషన్లు చేయునట్లు ప్రదర్శించరాదని, వెంటనే బోర్డును తొలగించాలని సూచించారు. ఆప్తాలమిక్ డాక్టర్, సిబ్బంది వివరాలు, అర్హత సర్టిఫికెట్లతో డిఎంహెచ్ఒ



కంటి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ

కార్యాలయంలో తప్పక నమోదు చేసుకోవాలన్నారు. ఆమె వెంట జిల్లా డాక్టర్ నాగేంద్ర నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సెల్వియా సాల్మాన్, డిప్యూటీ డెమో ఆఫీసర్ బాబా ఫకృద్దీన్ ఉన్నారు.

లింగ నిర్ధారణ నేరం: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఆర్‌డిఒ మహేష్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయమంలో శుక్రవారం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ సమాజంలో భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ వల్ల ఆడ శిశువుల జననాల రేటు గణనీయంగా పడిపోతుందన్నారు. దీనిని నివారించుటకు ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందన్నారు. లింగ నిర్ధారణ చేసిన ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై ప్రభుత్వ అధికారులు ఆకస్మిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ మహేష్

నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని వైద్య శాఖ అధికారులు, ప్రయివేట్ ఆసుపత్రి వైద్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరించాలని వినతి

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కదిరి ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు విన్నవించారు. యూనియన్ గౌరవా ధ్యక్షుడు ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కందికుంటను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా నూతనంగా ఎన్నికైన డిపో కమిటీ సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. ప్రయివేటు బస్సుల వల్ల సంస్థకు నష్టం వాటిల్లు తుందని తెలిపారు. పాత పద్ధతిలోనే వైద్య



ఎమ్మెల్యే కందికుంటను సన్మానిస్తున్న ఈయూ నాయకులు

సదుపాయం అందించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షులు జివైపి.రావు, రీజనల్ సిపిపి ఆర్ఎస్.రెడ్డి, డిపో నాయకులు జిసిఎస్ నాయుడు, డిపో కార్యదర్శి కొండారెడ్డి, గ్యారేజ్ అధ్యక్షులు రవి, కార్యదర్శి అక్బర్, ట్రెజరర్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పశువుల దాణా పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

రాయితీపై దాణా పంపిణీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

పాడి రైతులకు 50 శాతం రాయితీపై సమీకృత దాణా పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యశాల ఎడి శ్రీనివాసులు, వైద్యాధికారి గురునాథ్‌రెడ్డి తెలిపారు. 50 కిలోల దాణా పూర్తి ధర రూ. 1,110 కాగా 50 శాతం సబ్సిడీ పోను రైతు రూ. 555 చెల్లించాలన్నారు. పాడి పశువులు కలిగి ఉండి ఆధార్, బియ్యం కార్డు ఉన్న రైతులు అర్హులన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందజేసే పశు దాణాను రైతులు తీసుకొని పాడి పశువులకు ఉపయోగించి పాలఉత్పత్తిని పెంచుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. పశుగ్రాసం విత్తనాలు కూడా రాయితీపై ఇస్తున్నారని, 5 కిలోల ప్యాకెట్ రూ. 115 కు పశు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్, తిరు పతయ్య, మారుతి, రాము, హనీఫ్, నాయకులు ఆలేటి వీరనారప్ప, ఆకులేటి భాస్కర్, రవి, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

కూటమి ప్రభుత్వం తక్షణమే ఎన్నికల హామీలు నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య డిమాండ్ చేశారు. స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం ఆ పార్టీ మండల మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వేమయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు రద్దు చేయాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పిస్తూ రోజుకు రూ. 600 వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు కుటుంబంలో అందరికీ వర్తించేలా చూడాలని కోరారు. అనంతరం మండల శాఖ నూతన కార్యదర్శిగా రాజగోపాల్, సహాయ కార్యదర్శిగా అంజనమ్మ, చాంద్‌బాషాలను నియమించారు. కార్యక్రమంలో నాయకులు కాటమయ్య, బాలస్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పాదయాత్ర వాయిదా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ నెల 22, 23 తేదీల్లో పట్టణంలో చేపట్టాల్సిన పాదయాత్రను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 23వ తేదీ అమరావతిలో నిర్వహించనున్న సుపరిపాలన బహిరంగ సభలో మంత్రి పాల్గొననున్నారు. దీంతో పట్టణంలో మంత్రి చేపట్టాల్సిన పాదయాత్రను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే ఈ నెల 22వ తేదీ మంత్రి పట్టణంలోని తన కార్యాల యంలో అందుబాటులో ఉంటారని, ప్రజలు నేరుగా కలిసి సమస్యలు తెలియజేయవచ్చునని తెలిపారు. పాదయాత్రకు సంబంధించి కొత్త షెడ్యూల్ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని పెడపల్లి గ్రామంలో శుక్రవారం సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ ఆధ్వర్యంలో పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది అతిసార, జ్వరం, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు ఆయా జబ్బుల లక్షణాలు, మందులు, ముందస్తు జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. జబ్బు లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుస్మిత, ఆశా కార్యకర్తలు పద్మావతి, వాణిబాయి తదితరులు పాల్గొన్నారు .

వైసిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని రమణప్పగారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త ఆంజనేయులు (38) ఈ నెల 15వ తేదీ కౌలేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆ తర్వాత అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకుడు నాగేళ్ల రాజేంద్రనాయుడు శుక్రవారం ఈ గ్రామం వెళ్లి ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆదిమూర్తి, సూర్యశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, హరి, లక్ష్మీనారాయణ, కళ్యాణ్, శంకర్, తిరుపాల్, బాబు, వేమయ్య, రాఘవ, అంజి, నారాయణప్ప పాల్గొన్నారు.

యోగాడేను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఆర్‌డిఒ సువర్ణ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6:30 గంటలకు ఉజ్వల సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద నాలుగు రహదారుల వద్ద నిర్వహిస్తున్న యోగా డేలో పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ క్రాంతికుమార్

కమిషనర్ క్రాంతికుమార్ సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్, మెప్మా, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. రోజూ గంట పాటు యోగా చేయడం అలవర్చుకుంటే మనిషి ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకూ ఆర్‌డిఒ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంపిడిఒ సాయి మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా డేలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా యోగా అసోసియేషన్ ప్రెసిడెంట్ గాజుల సోమేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

గుడిబండ : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఉదయం 6:30 గంటలకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని న్యాయవాది శివకుమార్, లక్ష్మీనరసప్ప, దుర్గేష్ కోరారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ దినచర్యలో యోగాను భాగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, యువకులు, టిడిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని చౌడంపల్లి గ్రామానికి చెందిన బండి రమణ(22) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. వివరాలు.. రమణ భార్య సంధ్య పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీనికి తోడు 7 నెలల పాప అనారోగ్యానికి గురికావడంతో



బండి రమణ(ఫైల్ ఫొటో)

జీవితంపై విరక్తి చెందిన రమణ గ్రామ సమీపంలోని వంకలో ఓ చెట్టుకు ఉరివేసుకున్నాడు. రమణ తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం.. విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కుటాగుళ్లలో ఓ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి కుటాగుళ్లలోని ఆర్.ఆంజనేయులు ఇంట్లో 35 కర్నాటక టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేశారు. అతడు కర్నాటకలోని వేర్వేరు ప్రాంతాల నుంచి బస్సుల ద్వారా అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తుండేవాడని, అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఓ యువతి కనిపించలేదని కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని నల్లగుట్ట వీధిలో నివాసం ఉంటున్న పులగంపల్లి లక్ష్మీనారాయణ రెండో కుమార్తె లహరి(21) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. అయితే పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా తమ కుమార్తెతో చనువుగా ఉండేవాడని అతనిపై అనుమానం ఉందని లహరి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు.

ప్రజా సేవలో 'రెవెన్యూ శాఖ' కీలకం

రెవెన్యూ దినోత్సవంలో అధికారులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్‌డిఒ మహేష్ మాట్లాడుతూ ప్రజలకు సేవలందించడంలో మిగిలిన ప్రభుత్వ శాఖల కంటే రెవెన్యూ శాఖ ముందంజలో ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు, వారసత్వ మార్పులు, ఎన్ఒసి, తదితర సేవలను వేగంగా, పారదర్శకంగా అందించాలన్నారు. డిజిటల్ సేవల ప్రాముఖ్యతను వివరించారు. రెవెన్యూ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పని చేసి విఆర్ఒగా ఉద్యోగ విరమణ పొందిన హరిహరరావును సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, విఆర్ఎలు, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పారదర్శకత, జవాబుదారీ పరిపాలన అందించడంలో రెవెన్యూ శాఖకే సాధ్యమని తహశీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన నాగభూషణం, చలపతిలకు శాలువాలు కప్పి పూల



ధర్మవరంలో విశ్రాంత అధికారులను సన్మానిస్తున్న ఆర్‌డిఒ మహేష్

మాలలు వేసి ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసే వారు గర్వపడాలన్నారు. పురాతన కాలంలో ఏర్పాటు చేసి నేటికీ కొనసాగుతున్న శాఖ రెవెన్యూ అన్నారు. ఈ శాఖ ద్వారా ప్రజలు, రైతుల సమస్యలు పరిరక్షించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో అందుబాటులో ఉంటూ ముందస్తు రక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు అండగా ఉంటామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, సిఎస్‌డిటి ప్రభావతి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ కరుణాకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తహశీల్దార్లు శివశంకర్, రంగప్పలను ఘనంగా సన్మానించారు. వారు రెవెన్యూ డే విశిష్టత గురించి పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : రొళ్లలో తహశీల్దార్ షెక్షావలి ఆధ్వర్యంలో రెవెన్యూ డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ బిఎస్.గురుమూర్తి, టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, విశ్రాంత తహశీల్దార్ రంగప్ప హాజరై మాట్లాడారు. రెవెన్యూ కార్యాలయాలు ఏర్పడక ముందు ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి తీవ్ర ఇబ్బందులు పడేవారని, రెవెన్యూ కార్యాలయాలు ఏర్పడిన తర్వాత ప్రజలకు సకాలంలో అన్ని సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం విశ్రాంత తహశీల్దార్ రంగప్ప, విశ్రాంత విఆర్ఒలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, నాయకులు భరత్, జికె.ఈరన్న, రెవెన్యూ సిబ్బంది, విఆర్ఒలు పాల్గొన్నారు.

తాడిమర్రి : రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ గ్రామ రెవెన్యూ అధికారి నర్సయ్యను సన్మానించారు. తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ, భూ రికార్డుల నిర్వహణ, పన్నుల వసూలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూ సిబ్బంది పాత్ర కీలకమని తెలిపారు. సర్వేలో లోపాలను త్వరలోనే సవరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పరిగి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ హసీనాసుల్తానా మాట్లాడుతూ ప్రతి సామాన్యుడికి రెవెన్యూ సేవలను అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం రెవెన్యూ శాఖ ద్వారా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన అధికారులను సన్మానించారు. అలాగే రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగా హన ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న వీఆర్వో, వీఆర్ఏ, అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచి బాలాజీ పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమి రికార్డుల నిర్వహణ, పన్నుల వసూలు,



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూ సిబ్బంది పాత్ర కీలకం అన్నారు. అనంతరం విశ్రాంత సిబ్బంది రెడ్డి, బి.నరసింహారెడ్డిలను ఆత్మీయంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవినాయక్, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్వోలు సుశీల, జ్యోతి, నిర్మల, శ్రీనివాసులు, రబ్బాని, అరవింద్, ఇమ్రాన్, సర్వే సిబ్బంది నాగేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ రవి పాల్గొన్నారు

హిందూపురం : ప్రభుత్వ యంత్రాంగంలో ప్రజలకు సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. తహశీల్దార్ వెంకటేశుఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ ఉద్యోగులందరూ పట్టణంలో ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ వెంకటేశు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అందించే ముఖ్యమైన సేవలన్నీ రెవెన్యూ శాఖద్వారానే అందుతాయన్నారు. అనంతరం రెవెన్యూ రంగంలో ఉత్తమ సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన రెవెన్యూ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, నాగరాజు, మోహన్‌దాస్, గోపాలకష్ణ, ఇబ్రహీం, మహబూబ్ పీరా, శివయ్య, తిమ్మయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.